

పగిడేరులో హైలెవల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

'భూ భారతి' ఒక మైలురాయి

- 14న సీఎం చేతుల మీదుగా పోర్టల్ ప్రారంభం
- ఇందిరమ్మ ప్రజాపాలనలో ఇదొక అద్భుత ఘట్టం
- ప్రజల భూములన్నింటికీ భద్రత చేకూరుతుంది..
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మణుగూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించబోయే 'భూ భారతి' పోర్టల్... ఇందిరమ్మ ప్రజాపాలనలో ఒక మైలురాయిగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, పినపాక, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో మంత్రి పొంగులేటి శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మణుగూరులోని ప్రజాభవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూ భారతి వివరాలను వెల్లడించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజైన 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శిల్పారామంలో 'భూ భారతి'ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తారని తెలిపారు.

2020లో నాటి ప్రభుత్వం ధరణి చట్టాన్ని చేసిందని, కానీ 2023 వరకు కూడా ఖచ్చితమైన రూల్స్ (నిబంధనలు) తయారు చేయలేక పోయిందని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో భూ భారతి నిబంధనలను మూడు నెలల్లో పూర్తి చేసి చట్టం చేసిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఈ పథకం మైలు రాయిగా ఇది నిలుస్తొందన్నారు. కొత్త విధానంలో భూములకు సంబంధించిన ప్రతి అంశాన్ని, ప్రతి విషయాన్ని క్రోడీకరించి పరిష్కారాలను చూపడడం జరుగుతుందన్నారు. ఈ చట్టం వల్ల ప్రతి గజం భూమి భద్రత సాధ్యం అవుతుందన్నారు.

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేయడం జరుగుతుందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు, మహిళలకు ఆర్టీసీ బస్ సర్వీసులు, రూ.500కే గ్యాస్ సిలెండర్లతోపాటు (మిగతా 6వ పేజీలో)



కూనవరం గ్రామంలో నిరుపేద ఇంట్లో సన్నబియ్యం భోజనం చేస్తున్న మంత్రి



వసంతాన్ని రామయ్యపై చల్లుతున్న వైదిక సిబ్బంది

కల్యాణ రామునికి వసంతోత్సవం

- ఆహ్లాదకర వాతావరణంలో ఘనంగా నిర్వహణ
- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు
- రేపటి నుంచి నిత్య కల్యాణాలు షురూ

6



అశ్వారావుపేట సత్తుపల్లి రోడ్‌లో కూకటివేళ్లతో కూలిన భారీ వృక్షం..

అర్ధరాత్రి ఈదురుగాలుల బీభత్సం

- భయభ్రాంతులకు గురైన ప్రజలు
- పడిపోయిన కరెంటు స్తంభాలు.. తెగిన తీగలు
- అంధకారంలోనే పలు గ్రామాలు
- రాలిన మామిడి.. రూ.లక్షల్లో నష్టం

నామినేటెడ్ పదవుల భర్తీ ఎప్పుడో?



అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా అదే జాప్యం

- నిరాశలో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ కేడర్
- జిల్లాలో నాలుగు పవర్ సెంటర్లు
- ఏకాభిప్రాయానికి రాకపోవడం వల్లే ఈ పరిస్థితి
- స్థానిక ఎన్నికల తర్వాత భర్తీ ఉంటుందని ప్రచారం

ఖమ్మం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒక్కో పండుగ వచ్చి పోతున్నా నామినేటెడ్ పదవుల పండుగ రాకపోవడంతో కాంగ్రెస్ కేడర్‌కు ఎదురుచూపులు తప్పడం లేదు. ఏడాదిన్నరగా పండుగ వస్తుందంటే పదవుల కోసం ఆశగా ఎదురు చూడటం, నిరాశపడడం పరిపాటిగా మారింది. అధిష్ఠానం నుంచి నామినేటెడ్ పదవుల గురించి ప్రకటనలు వెలువడగానే ఏదో ఒక పోస్టు దక్కుతుందని ఉమ్మడి జిల్లాలో హస్తం పార్టీ నాయకులు ఆరాటపడుతున్నారు. గడిచిన పదేళ్లుగా ఎలాంటి పదవులు లేకుండా ప్రతిపక్షంలో పోరాటాలు, కేసులతో అనేక మంది నాయకులు సతమతమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తమకు గుర్తింపు లభిస్తుందని, పార్టీ పెద్దల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆశావహుల ఎదురుచూపు

తొలివిడతగా ఉమ్మడిజిల్లాకు నాలుగు కార్పొరేషన్ పదవులు లభించాయి. గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, ఐడీసీ ఛైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు, హస్తకళ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నాయుడు సత్యనారాయణ, అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు దక్కాయి. తర్వాత జిల్లాలో కొన్ని మార్కెట్ కమిటీల నియామకాలు జరిగాయి. కానీ కీలకమైన భద్రాచలం దేవస్థానంతోపాటు జిల్లాలో ఇతర దేవస్థాన కమిటీల నియామకం జరగలేదు. పాల్వంచ పెద్దమ్మగుడి పాలకమండలి నియామకం కాంగ్రెస్ వర్గాల మధ్య ఆధిపత్య పోరుకు దారితీసింది.

ఖమ్మం స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) నియామకం కూడా ఇప్పటివరకు జరగలేదు. దేవాలయ పాలకమండళ్లతో పాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ కమిటీలు, ఆర్టీసీ, రవాణశాఖ , గృహనిర్మాణ సంస్థ వంటి కార్పొరేషన్ కమిటీల (మిగతా 6వ పేజీలో)

బీఆర్ఎస్ సభకు భారీగా తరలి వెళ్లాలి

- 27న వరంగల్‌లో 10 లక్షల మందితో నిర్వహణ
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

కల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) వరంగల్‌లో ఈ నెల 27 న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేలా సత్తుపల్లి నియోజకవర్గ సత్తా చాటాలని బీఆర్ఎస్ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కల్లూరులో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రవిచంద్ర ప్రసంగిస్తూ బీఆర్ఎస్ రజతోత్సవ సభ కనీవిని ఎరుగని రీతిలో జరుగుతుందని అన్నారు. 10 లక్షల మందితో జరిగే సభకు గ్రామ గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు బయలుదేరి రావాలని పిలుపు నిచ్చారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ (మిగతా 6వ పేజీలో)



సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు



ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12, 13 శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కాగా 14న సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సెలవు ఉన్నట్లు ఆయన తెలిపారు. 15న మంగళవారం యథావిధిగా క్రయ, విక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవుల విషయాన్ని గ్రహించాలని కోరారు.

‘సన్న బియ్యం’తో పేదలకు లబ్ధి

- యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి
- భద్రాద్రి జిల్లాలో పర్యటన... స్వాగతం పలికిన శ్రేణులు
- సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం
- పూలే జయంతి యువజన నాయకుల నివాళి


సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, తదితరులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/భద్రాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నిరుపేద, ధనిక అనే తేడా లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకొచ్చిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనకు జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ఘన స్వాగతం పలికారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోనే అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ గ్రామ పంచాయతీలో సన్న బియ్యం లబ్ధిదారులు కుంచం మురళి-రమాదేవి దంపతుల ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో మొదటిసారిగా ప్రారంభించారన్నారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడిగా స్వాగతం పలికే కార్యక్రమంలో యువజన నాయకులు ఏర్పాటు చేసిన బాణ సంచాను కాల్చే క్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. పోస్టాఫీస్ సెంటర్‌లో బాణసంచా కాలుస్తుండగా చౌక్‌లో ఉన్న గడ్డిపై పడడంతో అది కాలిపోయింది. దీంతో నాయకులు స్పందించి చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పి వేశారు.

పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా పూలే జయంతి

విద్య, హక్కుల పరిరక్షణ ద్వారానే సామాజిక ఆర్థిక సమున్నతి లభిస్తుందని యువజన రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఆళ్ల మురళి అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామయ్యను దర్శించుకున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

భద్రాచల రామయ్యను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రామాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చీకటి కార్తీక్, గాడి విజయ్, ఆకుల వెంకట్, మాచినేని భాను, బేతంపూడి భరత్, సిద్ది ప్రవీణ్ పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే జయంతి రోజు అభివృద్ధి పనులు

- పూలేకు మంత్రి పొంగులేటి ఘన నివాళి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన


జ్యోతిబా పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, భద్రాద్రి కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే పాయం తదితరులు

మణుగూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పినపాక నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.4.60కోట్ల నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. తొలుత డిగ్రీ కాలేజి సిబ్బంది ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలు వేసి ఘన నివాళి ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పూలే జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ, సమాజానికి చేసిన సేవలు, ఆడబిడ్డలకు చదువు అవసరమని చెప్పిన మహామనిషి... పూలే అన్నారు. ఆయన ఆశయ సాధనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం అన్ని వర్గాలకు మంచి విద్యనందించే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి వారంరోజుల్లోనే ఆనాటి దొర నిర్మించిన ప్రగతి భవన్‌ను పూలే భవన్‌గా మార్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. భూమి ఉన్నంత వరకు ఈ సమాజం కొంత మందిని మాత్రమే గుర్తు పెట్టుకుందన్నారు. అలాంటి వ్యక్తుల్లో జ్యోతిబా పూలే ఒక్కరన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంతోపాటు అనేక రంగాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గతేడాది పూలే జయంతి రోజున మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెంలోని బాలికల కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారని మళ్లీ పూలే జయంతి రోజున మణుగూరులో డిగ్రీ కళాశాలలో విద్యాభివృద్ధి కోసం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం గమనార్హం అన్నారు. త్వరిత గతిన పనులు పూర్తి చేసి విద్యార్థులకు మంచి తరగతి గదుల సదుపాయాలను అందించాలని ఆయా శాఖల అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరామ్‌నాయక్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, సీపీఐ రాష్ట్ర నేత బి అయోధ్య, జిల్లా నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, స్థానిక అధికారులు, కాంగ్రెస్ నాయకులు చందా సంతోష్, నవీన్, శివసైదులు, కార్యకర్తలు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రగతి మెరుగునకు చర్యలు..

- వచ్చే విద్యా సంవత్సరంలో లక్ష్యాలు సాధించాలి..
- విద్యాశాఖ వార్షిక సమీక్షా సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ విపాటిల్

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖకు ప్రభుత్వం అగ్ర ప్రాధాన్యం ఇస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు కావాల్సిన వనరులు సమకూరుస్తున్నామని, వచ్చే విద్యాసంవత్సరంలో పటిష్టమైన ప్రణాళికలతో జిల్లాను విద్యాపరంగా ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ విద్యాశాఖాధికారులకు దిశానిర్దేశం చేశారు. కొత్తగూడెం జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలో ఏంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఏంలతో శుక్రవారం వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా వ్యవస్థ బలోపేతం కోసం అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. వాటి ఫలితంగా ఉత్తమ ప్రగతి సాధిస్తుందని, ఇదే స్ఫూర్తితో ఈ విద్యాసంవత్సరంలో గుర్తించిన తప్పులను సరిదిద్దుకుని పటిష్టమైన ప్రణాళికలతో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థులకు విత్తనాల సేకరణపై పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యాప్రగతిని డీఈవో వెంకటేశ్వరచారి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు, సమగ్ర శిక్ష ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి ఎస్.శ్రీనివాస్, ఏఎంవో నాగరాజశేఖర్, ఏంఈవోలు, హెచ్‌ఏంలు పాల్గొన్నారు.


ఆలయంలో శ్రీవారిని దర్శించుకుంటున్న మాజీ సీజే వెంకటరమణ దంపతులు

జమలాపురం శ్రీవారి సన్నిధిలో ఎన్వీ రమణ

ఎర్రుపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి మేళతాళాలతో ఆలయ వేద పండితులు, పురోహితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉప ఆలయాలను కూడా దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన వకుళమాత స్టేడియాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కే.విజయకుమారి, ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు చావా రామకృష్ణ, రామారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లను తట్టుకున్న కేఎన్ఎం 1638

వరి వంగడం క్షేత్ర ప్రదర్శనలో ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య


వరి క్షేత్ర ప్రదర్శనలో రైతులతో డీఏవో పుల్లయ్య

వైరా, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేఎన్ఎం 1638 సన్న రకం వరి విత్తనం స్వల్పకాలికమే కాకుండా అన్ని రకాల తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటుందని ఖమ్మంజిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. వైరా మండలంలోని అష్ణగుర్తి గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా సరఫరా చేసిన కేఎన్ఎం 1638 రకం విత్తనాలతో రైతులు సాగుచేసిన క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వరి రకాన్ని సాగు చేసిన రైతులు సాగులోని మెళకువలను ఇతర వివరాలను వివరించారు. ఈ సన్న రకం విత్తనం స్వల్పకాలిక రకం (120రోజులుగా) ఉందని, అగ్గితెగులు, ఉల్లికోడును సమర్థవంతంగా తట్టుకుంటుందని, దోమపోటును కూడా తట్టుకుందని కొంతమంది రైతులు తెలిపారు. ఈ రకం సాగులో తెగులు ఆశించలేదని, పంట మంచి ఎత్తులో అధిక దుబ్బులతో కంకులు బాగా ఏర్పడ్డాయని పేర్కొన్నాయి. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వచ్చే అవకాశముందని డీఏవోకు రైతులు వివరించారు. రైతులు వెంపటి నాగేశ్వరరావు, నర్వనేని గోపాలరావు తమ అనుభవాలను వివరించారు. వైరా, ఖమ్మం (టెక్నికల్) ఏడీఏలు తుమ్మలపల్లి కరుణశ్రీ, వాసవీ రాణి, వైరా ఏవో మయాన్ మంజూఖాన్, టెక్నికల్ ఏవోలు ఎస్.పవన్‌కుమార్, ప్రత్యూష, మాజీ సర్పంచ్‌లు ఇటుకల మురళి, కొణిదెన కోటేశ్వరరావు, రైతులు వెంపటి నాగేశ్వరరావు, శ్రీరామనేని వెంకటేశ్వరరావు, పొరపాటి వెంకటేశ్వర్లు, ఏఈవోలు వాసంతి, సైదులు, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

కల్యాణ రామునికి వసంతోత్సవం

భద్రాచలం ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామికి వసంతోత్సవం ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం 8వ రోజున నూతన వధూవరులైన స్వామి వారికి, అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించడం ఒక వేడుక. ఈ క్రమంలో ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారిని, అమ్మవారిని ఎదురెదురుగా కూర్చొబెట్టి వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వసంతాన్ని స్వామి వారిపై చల్లి చివరగా భక్తులపై చల్లారు. ఈ సమయంలో పట్టణంలో తిరువీధి సేవను సైతం నిర్వహించారు. ఇదిలా ఉండగా గజ వాహనంలో స్వామి వారికి తిరువీధి సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు కేశ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, అర్చకులు అమరవాది వెంకట్రామన్, అమరవాది శ్రీకాంతాచార్యులు పాల్గొన్నారు.



రేపటి నుంచి నిత్యకల్యాణాలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి గత నెల 30 నుంచి ఈనెల 12 వరకు నిత్యకల్యాణాలను నిలిపివేశారు. ఈక్రమంలో శనివారం చక్రతీర్థం, ధ్వాజరోహణం, ద్వాదశ ప్రదక్షణలు, శ్రీపుష్పయాగంలతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానుండటంతో ఆదివారం నుంచి స్వామివారికి నిర్వహించే నిత్యకల్యాణాలు పునరుద్ధరించనున్నారు.

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. మార్చి 30 నుంచి వసంతపక్ష ప్రయుక్త బ్రహ్మోత్సవాలు ఆరంభం కాగా నవాహ్నిక, నవమి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలో 4న ధ్వజారోహణం, 5న ఎదుర్కోలు నిర్వహించి 6న శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. 7న శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని జరిపారు. కాగా శనివారం నాడు చక్రతీర్థం నిర్వహించనుండగా సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజా అవరోహణ, ద్వాదశ ప్రదక్షణలు నిర్వహించనున్నారు.

నామినేటెడ్ పదవుల భర్తీ ఎన్నడో!?

(5వ పేజీ తరువాయి)

పదవులను కూడా జిల్లానుంచి ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న నియోజకవర్గ స్థాయి నాయకులు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గాల నుంచి ప్రతి నియోజకవర్గంలో సీనియర్ నాయకులున్నారు. వీరు కూడా పదవుల కోసం ఆశపడుతున్నారు. అయితే కాలయాపన తప్ప పదవులు మాత్రం అందడంలేదు. ఐదేళ్ల పాలనలో ఏడాదిన్నర పాలన దగ్గరపడుతోంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పదవుల నియామకం జరిగితే సగం మంది నాయకులకు ఒక దఫా అవకాశం దక్కేది. మరో రెండేళ్ల రెండో శ్రేణి కార్యకర్తలకు పదవులు అందేవి. అటు సీనియర్లకు, ఇటు జూనియర్లకు ఎవరికి పదవులు లేకపోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొంత వైరాగ్యం ఉంది.

గండి కొడుతున్న అభిప్రాయ బేధాలు...

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్సాహంగా పనిచేసిన నాయకులు ఇప్పుడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గతంలోలా ఉత్సాహం చూపడంలేదు. దీనికితోడు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కేంద్రాలుగా పార్టీలో అంతర్గత విభేదాలు నడుస్తున్నాయి. ఈ నలుగురు నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో ఏకాభిప్రాయం కుదరక నియామక పదవులకు ముడిపడడంలేదు.

నేతలకే వదిలేసిన సీఎం...

తుమ్మల, భట్టి, పొంగులేటి, రేణుకాచౌదరి రాష్ట్రస్థాయి నేతలు కావడంతో అధిష్ఠానం కూడా జిల్లాలో ప్రభుత్వ నియామక పదవుల విషయంలో కసరత్తుకు ఆసక్తి చూపడం లేని పరిస్థితి నెలకొంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగూడెం సభలో ‘ఖమ్మం జిల్లా రాజకీయాల జోలికి రాను.. మీ జిల్లాలోనే ఉద్దండులున్నారు.. మీ నిర్ణయమే నా నిర్ణయం..’ అంటూ నియామక పదవుల భర్తీ వ్యవహారాన్ని జిల్లా నేతలకే వదిలేశారు. దీంతో నియామక పదవులు వస్తాయా? లేదా? వస్తే ఎవరికి దక్కుతాయనే అనుమానాలు కాంగ్రెస్ కేడర్‌లో వ్యక్తమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతనే నియామక పదవులు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. నియామక పదవులు ఇవ్వకుండా ఎన్నికల్లో పనిచేయడం ఇబ్బందికరం అవుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

‘భూ భారతి’ ఒక మైలురాయి

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గంలో నాలుగు నుంచి ఐదు వేల మంది నిరుద్యోగ యువతకు చేయూతనందించేలా యువ వికాస కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, వారి ప్రభుత్వం ఉండగానే అది కూలిపోయిందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాళేశ్వరం లేకపోయినా 183కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తెలంగాణ రైతాంగం పండించిందని తెలిపారు. ఈ యాసంగిలో కోటికిపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం పండించబోతున్నారని తెలిపారు.

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటి అరా తప్ప అన్ని హామీలను నెరవేర్చడం జరిగిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే కొంత ఆలస్యం జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను క్రమంగా గాడిలో పెడుతున్నామని తెలిపారు. పినపాక నియోజకవర్గంలో రూ.35 కోట్లు వెచ్చించడం ద్వారా అనేక అభివృద్ధి పనులు చేయించడం జరుగుతుందన్నారు. పోడు భూములు, సీతారామ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గానికి నీరందడం లేదన్న సమస్యలు పరిష్కరించుకుంటామన్నారు. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న పులుసుబొంత ప్రాజెక్టుకు రాబోయే కొద్ది నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకు స్థాపనలు చేసుకోబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడి ఇంట్లో సన్న బియ్యం భోజనం

మణుగూరు మండలంలోని కూనవరం గ్రామంలో ఓ నిరుపేద గిరిజనుడి ఇంట్లో మంత్రి పొంగులేటి శుక్రవారం సన్నబియ్యం భోజనం చేశారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని రుచి చూసే కార్యక్రమంలో భాగంగా మంత్రి గిరిజనుడికి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా వంకా శివలక్ష్మి, కాంతారావు దంపతుల మధ్య మంత్రి నేలపై కూర్చొని భోజనం చేశారు. అనంతరం కాంతారావు దంపతులకు స్వయంగా వడ్డించారు. తర్వాత వారితో కాసేపు మాట్లాడి కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఎంపీ బలరామ్‌నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మంత్రి రాకతో కాంతారావు కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది.

బీఆర్ఎస్ సభకు భారీగా తరలిరావాలి..

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పది అడుగులు వెనక్కి పోయిందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వాన్ని ఎందుకు ఎన్నుకున్నామా.. అని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులనే కొనసాగించటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ నెల 27న గ్రామ గ్రామాన పార్టీ జెండాను ఆవిష్కరిస్తూ వేడుకలాగా జరుపాలని పార్టీ శ్రేణులను కోరారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్లను రవిచంద్ర, సండ్ర ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, నాయకులు కట్టా అజయ్‌కుమార్, బీరవల్లి రఘు, కాటంనేని వెంకటేశ్వరరావు, లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, దేవరపల్లి భాస్కరరావు, యస్‌కె కమ్లి, కొరకొప్పు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మహిళా మార్ట్

ఖమ్మం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): షాపింగ్ మాల్స్ తరహాలో ఖమ్మంలో మహిళా మార్ట్ (కేఎంఎం) రాబోతుంది. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో స్వయం సహాయక సంఘాల మహిళలతో మార్ట్ ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మంలోని సీక్వెల్ రోడ్డులో డ్వాక్రాబజార్ భవనాన్ని మహిళా మార్ట్‌గా తీర్చిదిద్దే పనులు సాగుతున్నాయి. నెలాఖరులో మహిళా మార్ట్ ప్రారంభం కాబోతుంది. జిల్లాలోని స్వయం సహాయక మహిళ సంఘాలు సొంతంగా తయారుచేసిన పలురకాల ఉత్పత్తులతో పాటు ప్రజలకు అవసరమైనటువంటి వస్తువులను మహిళ సంఘాలు ఈ మార్ట్‌లో అమ్ముకునే సదుపాయం కలిపిస్తున్నారు. మహిళలే వ్యాపారవేత్తలుగా ఆహారపదార్థాలకు సంబంధించి పలు ఉత్పత్తులను, చేనేత ఉత్పత్తులను ఇళ్లలో వినియోగించే ఆకర్షణీ వస్తువులు, ప్రైవేటు మాల్స్‌లో ఉన్న పలు తరహా ఉత్పత్తులను కూడా ఈ మార్ట్‌లో స్వయం సహాయక సంఘాలు అమ్ముకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు.

మార్ట్‌లో స్టాకు నిలవలు ఎవరికి వారు పకడ్బందీగా ఉంచుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మహిళలకు లంచ్‌గది, ఇతర సౌకర్యాలు కల్పించాలని కూడా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇటీవల మార్ట్ పనులు సదర్శించినప్పుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, బిల్లింగ్ వ్యవస్థనుకూడా కంప్యూటరీకరణపై అవగాహన కలిపించబోతున్నారు. వ్యాపార దృక్పథంతో మహిళలు రాణించేందుకు ఈ మహిళా మార్ట్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటుచేస్తున్నారు. నెలాఖరులోగా మహిళా మార్ట్ ప్రారంభంకాబోతుంది.

అర్ధరాత్రి ఈదురు గాలుల బీభత్సం


నారాయణపురంలో విరిగిపోయిన మామిడిచెట్లు


అశ్వారావుపేటలో రోడ్డుపై పడిపోయిన కొబ్బరిచెట్లు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలో గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. ఒక వైపు గాలులు, మరో వైపు వాన దాదాపు గంట పాటు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి. బలమైన గాలులు, వానతో బయటకు రావటానికి కూడా సాహసంచేయలేని పరిస్థితి. అశ్వారావుపేట, అల్లిగూడెం, రామన్నగూడెం, కన్నాయిగూడెం, మల్లాయిగూడెం, నారాయణపురం ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. రహదారుల వెంట పెద్ద పెద్ద చెట్లు కూడా కూకటి వేళ్లలో నేలమట్టం అయ్యాయి. పెద్ద పెద్ద చెట్లు పడిపోవటంతో ఒక్క అశ్వారావుపేటలోనే 16 కరెంటు స్తంభాలు నేలకూలాయి. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అల్లిగూడెం, రామన్నగూడెం, తిరుమలకుంట, కన్నాయిగూడెం ప్రాంతాల్లో మరో 9 కరెంటు స్తంభాలు పడిపోయాయి. కరెంటు తీగలు పూర్తిగా తెగిపోయాయి. విద్యుత్‌శాఖకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

కరెంటు స్తంభాలు పడిపోవటంతో అనేక గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే పనులు చేపటి సరఫరాను పునరుద్ధరించారు. అకాల గాలులకు గతంలోనే మామిడికి నష్టం రాగా గురువారం భీకర గాలులకు ఉన్న కాసిన్ని కాయలు కూడా నేలరాలాయి. నారాయణపురం, వినాయకపురం, గుర్రాలచెరువు, అశ్వారావుపేట ప్రాంతాల్లో ఉన్న మామిడితోటల్లో ఎక్కడ చూసినా నేలరాలిన కాయలే ఉన్నాయి. దిగుబడి అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో ఈదురు గాలులకు ఉన్న కాయలు కూడా నేలరాలటంతో ఒక్కో రైతుకు రూ.లక్షల మేర నష్టం వాటిల్లింది. గుర్రాలచెరువు, అల్లిగూడెం ప్రాంతాల్లో కూరగాయలు సాగు దెబ్బతిన్నది. మల్లాయిగూడెం, పండువారిగూడెం ప్రాంతాల్లో పొలాల్లో పీకి ఉంచిన వేరుశనగ వర్షానికి తడిచిపోయింది. వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు వచ్చిన భీకర గాలులు ప్రజలను, వివిధ శాఖలను అతలాకుతలం చేస్తున్నాయి. అకాల వర్షాల వలన దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన కొబ్బరి చెట్టు

క్రైం సమాచారం

ఇద్దరిపై కత్తితో దాడి

చర్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆటోతో ఎందుకు ఢీకొట్టావని అడిగినందుకు ఇద్దరు యువకులను కత్తితో గాయపరిచిన సంఘటన మండలంలోని పూసుగుప్ప గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పూసుగుప్ప గ్రామానికి చెందిన వినోద్, భూపతి అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వామనంలో పెట్రోల్ అయిపోవడంతో చర్ల రోడ్‌లో ఆగి పెట్రోల్ పోస్తున్నారు. ఇదే క్రమంలో ఆటో నడుపుకుంటూ ఆదే రహదారిపై వెళ్తున్న పండా కృష్ణమూర్తి మోటార్ సైకిల్‌ను ఢీకొంటూ పూసుగుప్ప గ్రామానికి వెళ్లాడు. పూసుగుప్ప గ్రామం చేరుకున్న వినోద్, భూపతి... కృష్ణ మూర్తి ఇంటికి వెళ్లి ఆటోతో ఎందుకు ఢీకొట్టావని ప్రశ్నించారు. దీంతో గొడవ పెరిగి కృష్ణమూర్తి ఆ ఇద్దరు యువకులపై కత్తితో దాడి చేశాడని బాధితులు తెలిపారు. కృష్ణ మూర్తి పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

జూలూరుపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా మద్యానికి బానిసై మండలంలోని బచ్చలకోయగూడెం గ్రామానికి చెందిన మడి కృష్ణయ్య(55) అనే వ్యక్తి ఉరివేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణయ్య గత ఐదేళ్లుగా ఎలాంటి కూలీ పనులకు వెళ్లకుండా మద్యానికి బానిసైయ్యాడు. మద్యం సేవించిన సమయంలో తనకు జీవితం మీద విరక్తి కలుగుతుందని, చచ్చిపోవాలనిపిస్తుందని పలుమార్లు భార్య రాధమ్మతో చెప్పాడు. ఈ క్రమంలో భార్య స్నానానికి వెళ్లిన సమయంలో ఉదయం కృష్ణయ్య ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఆమె ఇంట్లోకి వచ్చేసరికి భర్త ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆమె ఆందోళన చెంది చుట్టూ పక్కల వారిని పిలిచి భర్తను జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చింది. వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు పరిశీలించి కృష్ణయ్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధలోని మైలారం గ్రామంలోని బస్‌షెల్టర్‌లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోవడాన్ని గ్రామస్థులు గుర్తించారు. ఆ వ్యక్తిని గ్రామపంచయతీ కార్యదర్శి చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదే రోజు సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడిఒంటిపై రాయల్‌క్లబ్ ముద్రతో ఉన్న గోధుమరంగు చొక్కా ఉంది.

చికిత్స పొందుతూ విద్యార్థి ...



పెనుబల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీఎం బంజర్ ఉన్నత పాఠశాల విద్యార్థి సడియం వంశీ(14) శుక్రవారం మృతి చెందాడు. గత సోమవారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా పెనుబల్లిలోని కొత్తగూడెం రోడ్డులో లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వంశీ వైద్యఖర్చుల నిమిత్తం ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు దాతలు రూ.రెండులక్షల సహాయం అందించినప్పటికీ అతడి ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. దీంతో చౌడారం, పాఠశాలలోనూ తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడు ..

కొణిజర్ల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధిలోని పల్లిపాడు గ్రామానికి చెందిన గాజనబోయిన శేషయ్య(78) తెల్లవారుజామున సమయంలో సెంటర్‌లోని వాకింగ్ చేస్తున్నాడు. రోడ్డుదాటుతుండగా వైరా నుంచి కొణిజర్ల వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ద్విచక్రవాహనదారుడు వేల్పుల వెంకటేశ్వరరావుకు స్వల్పగాయాలు కాగా శేషయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. శేషయ్యను ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

సుజాతనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలవగా, కుమారుడికి తీవ్ర గాయాలు అయిన సంఘటన శుక్రవారం సుజాతనగర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం వైపు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తూ సుజాతనగర్ సెంటర్లో రోడ్డు దాటుతున్న పోడియం దినేష్(39), అతని కుమారుడు భీమాని ఢీ కొట్టింది. దీంతో పోడియం దినేష్ అక్కడికక్కడే మృతిచెందగా, అతడి కుమారుడు భీమాకు గాయాలు కాగా 108 వాహనంలో క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరణించిన దినేష్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా వాసిగా గుర్తించారు. మృతుడు దినేష్(39) గత ఎనిమిదేళ్లుగా ములకలపల్లిలోని ధర్మన్న నగర్‌లో ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. యాక్సిడెంట్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ దమ్మపేటకు చెందిన కోటగిరి శ్రీనివాసరావుపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. రమాదేవి తెలిపారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత

తల్లాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో శుక్రవారం శతాధిక వృద్ధురాలు పడాల దర్గమ్మ(104) మృతిచెందారు. దర్గమ్మకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి స్వాధీనం

పెనుబల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో అక్రమంగా రవాణా చేస్తున్న ఒక కిలో 110గ్రాముల గంజాయిని పోలీసులు వీఎం బంజర్ బస్టాండ్‌లో పట్టుకున్నారు. మండలంలోని లంకపల్లి గ్రామానికి చెందిన బోదిన వెంకటరమణ ఒడిసా నుంచి అక్రమంగా గంజాయిని భద్రాచలం నుంచి విజయవాడ వెళ్లే బస్సులో తరలిస్తున్నాడు. సమాచారంతో ఎస్‌ఐ కె.వెంకటేష్ సిబ్బందితో కలిసి బస్టాండ్ ఆవరణంలో బస్సులో తనిఖీ చేశారు. వెంకటరమణ వద్ద కిలో 110గ్రాముల గంజాయి దొరికింది. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ల రాజమల్లు, బి.వెంకటేశ్వరరావు, బాలు పాల్గొన్నారు.

తప్పిన భారీ అగ్నిప్రమాదం

ఖమ్మంక్రైం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): నగరంలో స్తంభాద్రి ఆలయ గుట్ట కింద భాగంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. గుట్టకింద భాగంలో కొంతమంది చిన్నచిన్న నివాసాలు ఏర్పాటుచేసుకుని ఉంటున్నారు. ఆ ఇళ్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి వెనుక వైపు విసిరాడు. దీంతో అక్కడున్న గడ్డికి అంటుకుని మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు వెంటనే ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనస్థలం వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

అత్తను కత్తితో పొడిచిన అల్లుడు

పినపాక, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన అరవ సతీష్ అనే వ్యక్తి మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన గుండు నాగశ్రీ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సతీష్ వ్యసనాలకు బానిసై అప్పులు చేసి కట్నం కోసం భార్య నాగశ్రీని వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో తన భార్య, బిడ్డను తనకు తన అత్తే దూరం చేసిందని కక్ష పెంచుకున్నాడు. సతీష్ అత్త భూమికౌలు డబ్బుల కోసం వచ్చిన విషయాన్ని తెలుసుకుని, తన బంధువుల ఇంట్లో ఆమె భోజనం చేస్తుండగా ఆమెపై విచక్షణా రహితంగా కత్తితో పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న అత్త నాగలక్ష్మిని బంధువులు ఆసుపత్రికి తరలించారు.

గొంతు తడవాలంటే.. ఆంధ్రాకు వెళ్లాల్సిందే!

- కన్నాయిగూడెంలో రెండు నెలలుగా తాగునీటి కష్టాలు
- నీటికోసం రెండున్నర కి.మీ. దూరంలోని పూచికపాడుకు..

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం ఆగ్రామ గిరిజనులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. రెండు నెలలుగా నీటికోసం ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగానికి పట్టటం లేదు. దీంతో రెండున్నర కిలోమీటర్ల దూరంలో పొరుగు రాష్ట్రంలో ఉన్న గ్రామానికి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఆంధ్రా నీళ్లు వస్తేనే గిరిజనుల దాహార్తి తీరుతుంది.

అశ్వారావుపేట మండలంలోని మారుమూలన ఉన్న గిరిజన గ్రామం కన్నాయిగూడెంలో గత రెండు నెలలుగా తాగునీటి ఎద్దడి ఏర్పడింది. 125 వరకు కుటుంబాలు ఉన్న ఇక్కడ రెండు ట్యాంకులు ఉన్నాయి. ఒక ట్యాంకుకు పంచాయతీ ద్వారా నీటిని ఎక్కిస్తే మరో ట్యాంకుకు పూర్తిగా మిషన్ భగీరథ నీరే వస్తుంది. అయితే గత కొంతకాలంగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఉన్న మరో ట్యాంకుకు ఉన్న పంచాయతీ మోటారు ద్వారా ట్యాంకులోకి నీరు పెద్దగా ఎక్కటం లేదు. ఈ ట్యాంకు ద్వారా జరిగే నీటి సరఫరా పట్టుమని పది ఇళ్లకు కూడా రావటం లేదు. ఇవి కాకుండా మరో రెండు చేతిపంపులు ఉన్నాయి. ఇవి కూడా వేసవి ఎండలకు భూగర్భజలాలు అడుగంటటంతో పది బిందెలు కూడా నీరు బయటకు రావటం లేదు.

తాగునీటి కోసం పూచికపాడుకు...

గ్రామంలో తాగునీటి సరఫరా లేకపోవటంతో గిరిజనులు దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పూచికపాడు గ్రామానికి వెళుతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాక్టర్లపై పీపాలు వేసుకుని అక్కడరకు వెళ్లి వ్యవసాయ మోటార్లు, ఇతర మోటార్ల ద్వారా నీటిని పట్టుకుని గ్రామానికి తెచ్చుకుని నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. కొందరు ఆటోల్లో, మరికొందరు ద్విచక్ర వాహనాలపై డబ్బాలను పెట్టుకుని వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ట్రాక్టర్ ద్వారా నీటిని తెచ్చుకున్నందుకు రోజుకు కొంత నగదును కూడా వ్యయం చేస్తున్నారు.



ట్రాక్టర్‌పై డ్రమ్ముల్లో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు



నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శోభన్‌ను వివరణ కోరగా ఒక ట్యాంకుకు మాత్రమే పంచాయతీ మోటారు ఉందని, మరో ట్యాంకుకు మిషన్ భగీరథ నీరు వస్తుందని తెలిపారు. మిషన్ భగీరథ నీరు కొద్దిరోజులుగా రాకపోవటంతో రెండు వీధులకు చెందిన ప్రజలకు నీటి సరఫరా జరగటం లేదన్నారు. రెండు ట్యాంకులకు పంచాయతీ నీరే ఎక్కించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘యూ డైస్’పై తృతీయపక్షం తనిఖీ

డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని ‘యూ డైస్’ సమాచారంపై తృతీయ పక్షం తనిఖీని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ అన్నారు. నగరంలో టేకులపల్లిలోని డైట్ కళాశాలలో ఉపాధ్యాయులతో, విద్యాశిక్షణ సంస్థలో చదువుతున్న విద్యార్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యాశిక్షణలో చదువుతున్న ప్రతి విద్యార్థికి పది పాఠశాలలు కేటాయించాలన్నారు. ఏప్రిల్ 15నుంచి 21వరకు పాఠశాలలను సందర్శించి స్కూల్ రిపోర్టు కార్డులో యుడైస్ పోర్టల్ ద్వారా పొందుపరిచిన అంశాలను స్వయంగా పరిశీలించాలన్నారు. అందులో ఏవైనా తేడాలుంటే డీఈవోకు ఏప్రిల్ 22న జరిగే సమావేశంలో అందించాలని, అందుకుగాను వంద మంది విద్యార్థులకు పది పాఠశాలల వంతున కేటాయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలు, సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లాప్లానింగ్ కో ఆర్డినేటర్ సీహెచ్ రామకృష్ణ, స్టాటిస్టికల్ కో ఆర్డినేటర్ భానుప్రకాష్, లెక్చరర్ బాలమురళి చపాల్గొన్నారు.

ఎస్‌ఏ పరీక్షల పరిశీలన

నగరంలోని ఇందిరానగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న సమ్మెటివ్ అసిస్మెంట్-2 తెలుగు పరీక్షను జిల్లా అకడమిక్ మానెటరింగ్ అధికారి కె.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి తల్లిదండ్రులు పాఠశాలలకు సంబంధించి నిర్ణయం తీసుకోకముందే మందుస్తు బడిబాట నిర్వహించి ప్రవేశాలకు పెంపునకు కృషిచేయాలని కోరారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ



వీసీలో మాట్లాడుతున్న సీపీ

బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సెక్టార్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా స్వీకరించాలని, తద్వారా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని సెక్టార్ ఇన్‌చార్జి పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్సు ద్వారా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ హనుమాన్ జయంతి ప్రశాంత వాతావరణంలో జరిగేలా బందోబస్తు ఏర్పాటుచేయాలని సూచించారు. సున్నిత ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఏదైనా సమస్యలుంటే వెంటనే స్టేషన్ హౌజ్ ఆఫీసర్ దృష్టికి తేవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషిచేయాలని అన్నారు. ప్రజలకు ఎప్పుడు ఏక్షణమైనా తామున్నామనే భరోసా కలిపించాలన్నారు. గ్రామాలలో ర్యాలీలు, సదస్సులు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. మాదకద్రవ్యాలకు కట్టుదిట్టమైన నిఘాతో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల్లో భాగంగా నిర్వహించే పలు కార్యక్రమాల్లో ఎటువంటి ఆటంకాలు శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయ సహకారం అందించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్, మోసాలు, లోన్‌యాప్ కార్యకలాపాలపై నిఘా పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ ప్రసాదరావు పాల్గొన్నారు.

చదువు ప్రాముఖ్యతను చాటిన మహనీయుడు ఫూలే

- ఆయన స్ఫూర్తితో మెరుగైన విద్యకు చర్యలు
- జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చదువుతోనే జీవితంలో మార్పు సాధ్యమని, విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా ఫూలే అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మ జ్యోతిబా ఫూలే 199వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ కారణంగా దళితులు, బడుగు బలహీన వర్గాల పట్ల తీవ్ర వివక్షకు గురయ్యేవారని అన్నారు. 1827లో మహిళలను సమానంగా చూడటం అనే ఆలోచన కూడా చాలా కష్టమని, అటువంటి పరిస్థితుల్లో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులు ఫూలే అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ, రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలకు కూడా ఫూలే స్ఫూర్తిగా నిలిచారన్నారు. రిజర్వేషన్లకు ప్రాతిపదిక వేసింది కూడా ఫూలే అని అన్నారు. విద్య అందరికీ అందాలని ఫూలే దంపతులు కృషి చేశారని, బాలికల విద్యపై ఫూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని అన్నారు. స్త్రీలు విద్యావంతులు కావాలని ఆకాంక్షించారని తెలిపారు. ఆయన భార్యకు ఉన్నతమైన స్థానం కల్పిస్తూ ఆ రోజుల్లోనే సమానత్వం చూపించారని, భర్త ఆశయాలకు జీవితాంతం కృషి చేస్తూ మహిళలను విద్యావంతులు తయారుచేయడంలో సావిత్రిబాయి ఫూలే నిమగ్నమయ్యారని అదనపు కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్, శ్రీ శ్రీ సర్కిల్ లోని మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జి. జ్యోతి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, బీఎస్పీ పార్టీ జిల్లా ఇంచార్జీ అయితగాని శ్రీనివాస్ గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణమాచార్యులు, దాసరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, దొడ్డి కొమురయ్య సినీ నిర్మాణ కమిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ రెహ్మాన్, తెలంగాణ యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి కె.రోశయ్య యాదవ్, తెలంగాణ యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్సూర్ యాదవ్, ఎంబీసీ రాష్ట్ర కో కన్వీనర్, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు షేక్ షకీన తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిబా ఫూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

రైతులకు అన్యాయం చేస్తున్న మంత్రులు

బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసూదన్‌రెడ్డి

జూలూరుపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఖమ్మం జిల్లాకు జలాలను తీసుకెళ్లి ఇక్కడి రైతులకు అన్యాయం చేశారని కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేపీ కిసాన్‌మోర్చా బృందం జూలూరుపాడు మండలంలోని వినోభానగర్‌లో నిర్మించిన సీతారామ రాజీవ్ లింక్ కెనాల్‌ను సందర్శించింది. ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో వ్యవసాయం పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని చెరువులకు సీతారామ ద్వారా గోదావరి జలాలను అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, చావా కిరణ్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కంపెనీ మోసం

గిరిజన రైతుల ఆందోళన



జూలూరుపాడులో ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

జూలూరుపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న విత్తన కంపెనీ యాజమాన్యం మోసం చేసిందంటూ జూలూరుపాడు, చండ్రుగొండ మండలాలకు చెందిన గిరిజన రైతులు జూలూరుపాడులో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఓ కంపెనీకి చెందిన మొక్కజొన్న పంటను జూలూరుపాడు, చండ్రుగొండ మండలాలరైతులు సాగుచేశారు. కంపెనీ వారు పంటసాగు చేసే ముందు ఎకరానికి రూ.75వేలు చొప్పున చెల్లించి పంటను కొనుగోలు చేస్తామని, ఒకవేళ పంట ఎక్కువ పండితే టన్నుకు రూ. 25వేలు చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. కాగా తాము పండించిన పంటను కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుండటంతో వారు ఆగ్రహించారు. పంటను లారీలో లోడు చేసిన తర్వాత డబ్బులు ఇస్తామని చెప్పటంతో రైతులు తమ పంటను లోడు చేయించారు. కాగా వారు డబ్బులు ఇవ్వకపోవటంతో గురువారం అర్ధరాత్రి గిరిజన రైతులు జూలూరుపాడులోని సాయిబాబా ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.

మూలం సంత... ఆరోగ్యం కొండంత

- సేంద్రియ ఉత్పత్తులకు ఆదరణ
- బియ్యం, కూరగాయలు, పండ్లు అన్నీ ఆర్గానిక్ ఉత్పత్తులే
- నగరంలో ప్రతి రెండో శని, ఆదివారాల్లో ప్రత్యేక మేళా

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. మనం ఎన్ని డబ్బులు సంపాదించుకోగలిగినా ఆరోగ్యాన్ని మాత్రం కొనలేము. మనిషి ఆరోగ్యంగా ఉన్నాడంటే అతనికి మించిన అదృష్ట వంతుడు లేనట్లే లెక్క. అలాంటి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం కోసం ప్రజలు ప్రకృతి, సేంద్రియ పద్ధతులలో పండించిన ఆహార పంటల వైపు మక్కువ చూపుతున్నారు. అలాంటి పర్యావరణహితమైన ఆర్గానిక్ పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు సైతం చర్యలు తీసుకుంటున్నాయి. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో రసాయనాలతో కాకుండా కేవలం ఆర్గానిక్ పద్ధతిలో పండించిన ఆరోగ్య దాయకమైన ఆహార పదార్థాలను ఒక వేదిక ద్వారా అమ్మేందుకు కొందరు ఔత్సాహికులు ముందుకొచ్చారు. అందులో భాగంగానే గ్రామభారతి అనే సంస్థ, కిసాన్ మోర్చా సభ్యులతో కలిసి ప్రతి రెండవ శని, ఆదివారాల్లో నగరంలోని బ్యాంక్ కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏమూలం సంతూ పేరుతో సేంద్రియ ఉత్పత్తుల మేళాను నిర్వహిస్తున్నారు. దీంతో ఆరోగ్యాభిలాషులు ఆయా మేళాలో తమకు కావాల్సిన ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తుండటం విశేషం.



సమీకృత మార్కెట్‌లో గత నెలలో ఏర్పాటు చేసిన మూలం సంత మేళా

అన్నీ ఆర్గానిక్ ఉత్పత్తులే

మేళాలో సేంద్రియ కూరగాయలు, బియ్యం, కందిపప్పు, పండ్లు, పర్యావరణ స్నేహపూర్వక ఉత్పత్తులు, అరకు కాఫీ, శొంఠికాఫీ, దవా చాయ్, ఆర్గానిక్ స్వీట్లు, మిల్లెట్ స్నాక్స్ మొదలగు ఉత్పత్తులు అమ్ముతుంటారు. మేళాలో సుమారు 15 నుంచి 20 మంది పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించే రైతులు, ఔత్సాహికులు దుకాణాలు ఏర్పాటు చేసి తక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నారు. ఇలాంటి మేళాలు హైదరాబాద్, వరంగల్ నగరాలలో నెలలో ఒక రోజు మాత్రమే నిర్వహిస్తుండగా కేవలం ఖమ్మంలో ప్రతి నెలా రెండో శని, ఆదివారాలు రెండు రోజులు నిర్వహించడం విశేషం. మేళాలో సేంద్రియ రైతులతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల సేంద్రియ రైతులు కూడా పాల్గొంటారు.

నిరంతర చెకింగ్

నగరంలో నిర్వహించే సేంద్రియ ఉత్పత్తుల మేళాలో ఆయా ఆహార పదార్థాలు సేంద్రియమా కాదా అని నిర్ధారించేందుకు మూలం సంత నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ అధికారులచే నిరంతరం తనిఖీలు చేయిస్తుండటం విశేషం.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం

కుతుంబాక మాధవి(గ్రామభారతి)



సేంద్రియ ఆహార పంటలతో ఆరోగ్యం సిద్ధిస్తుంది. రసాయనాలు వాడి పండించిన పంటలతో క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయి. ఆరోగ్యాభిలాషులు మూలం సంతను సద్వినియోగించుకోవాలి

సేంద్రియ రైతులను ప్రోత్సహించాలి

నల్లమల వెంకటేశ్వరరావు(కిసాన్ మోర్చా)



ఇలాంటి మూలం సంత ఆర్గానిక్ మేళా ద్వారా సేంద్రియ రైతులను, సాగును ప్రోత్సహించినట్లవుతుంది. ప్రకృతి తరహాలో పర్యావరణ హితంగా పండించిన పంటలను అందరూ ఆదరించాలి. నగర ప్రజలు ఒక సారి మేళాలో లభించే ఉత్పత్తులు వాడి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి.

అగ్నివీర్ ఎంపికలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి గాను ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరిల వారీగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, క్లర్క్, టెక్నికల్, స్టోర్ కీపర్, ట్రేడ్‌మెన్‌ల ఉద్యోగాల ఎంపికల కోసం తెలంగాణాకు చెందిన అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు తమ దరఖాస్తులు ఈనెల 25 కల్లా www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఉత్సాహవంతులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా జ్యోతి బా పూలే జయంతి

నివాళులర్పించిన అధికారులు, నేతలు

జ్యోతి బా పూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద అధికారులు, నేతలు నివాళులు అర్పించారు. జ్యోతి బా పూలే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వివిధ పార్టీలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్


ఖమ్మం టీడీపీ కార్యాలయంలో..


ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో..



టీజీవో కార్యాలయంలో..


టీఎన్జీవో కార్యాలయంలో..


తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో


బీఆర్ అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో


నేలకొండపల్లి బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు

ఇసుక క్వారీల తనిఖీ


క్వారీ వద్ద అధికారుల బృందం

నేలకొండపల్లి, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముఖ్యంగా పైనంపల్లి, రామచంద్రాపురం గ్రామాల వద్ద పైనంపల్లి ఏట్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని పెద్ద ఎత్తున వస్తున్న/వచ్చిన ఆరోపణలపై శుక్రవారం సాయంత్రం మైనింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో కూడిన బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. గూగుల్‌లో రామచంద్రాపురంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని, అందుకు ప్రత్యేకంగా రోడ్డును వేసారని కనిపంచటం తీవ్ర చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో అధికారుల తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అధికారుల బృందం పైనంపల్లి, రామచంద్రాపురం వద్ద ఇసుక క్వారీలను తనిఖీ చేసింది. ఇసుకను అక్రమంగా రవాణా చేయటానికి వేసిన రోడ్డును వెంటనే తొలగించాలని ఆదేశించారు. కాకపోతే అధికారుల బృందం తనిఖీకి వెళ్ళిన సమయంలో అక్కడ ఎటువంటి వాహనాలు కానీ, ఇసుక కుప్పలు కానీ కనపడలేదని సమాచారం. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్‌రావు, ఇరిగేషన్ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.

డీసీసీబీ ఎదుట ఆందోళన

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాచిరాజుగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 267లో తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, దొంగ కాగితాలతో డీసీసీ బ్యాంకు శాఖలలో వివిధ పేర్లతో సుమారు కోటి రూపాయలు రుణాలు పొందారని శుక్రవారం బాధిత రైతులు డీసీసీబీ ఎదుట ఆందోళనకు దిగారు. కొందరు వ్యక్తులు అక్రమంగా నకిలీ కాగితాలతో తమ భూములను చూపించి లోన్లు పొందారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు సీఈవో వెంకటాద్యితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్టీలమైన తమ భూములపై లోన్లు పొందిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, తమ భూములను లోన్ల నుండి విముక్తి చేయాలని కోరారు. అక్రమంగా లోన్లు పొందినందుకు వారిపై బ్యాంకు ద్వారా క్రిమినల్ కేసులు పెట్టి, అక్రమంగా లోన్లు పొందినందుకు అరెస్టు చేయవలసిందిగా కోరారు. దీనిపై సీఈవో వెంకటాదిత్య మాట్లాడుతూ తమ బ్యాంకులో ఉన్న లోన్లను తీసుకున్న వారు సక్రమంగానే చెల్లిస్తున్నారని, భూముల రిజిస్ట్రేషన్ విషయం తమ పరిధిలోకి కాదని, అది రెవెన్యూ అంశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు అజ్మీరా భాస్కర్, అజ్మీరా సేంద్య, అజ్మీరా కోట్య, అజ్మీరా ఝాన్సీ , అజ్మీరా మంగమ్మ, అజ్మీరా నీల పాల్గొన్నారు.

నేటినుంచి 19 వరకు సెలవులో కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం నుంచి ఈనెల 19 వరకు సెలవులో వెళ్తున్నారు. వ్యక్తిగత కారణాల కోసం సెలవుకోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు 15వ తారీకు నుంచి 19వరకు సెలవుకు అనుమతి లభించింది. రెండో శనివారం, ఆదివారం, సోమవారం అంబేద్కర్ జయంతి పబ్లిక్ సెలవుల నేపథ్యంలో ఈ మూడు రోజులతో పాటు 15వ తేదీ నుంచి 19 వరకు సెలవులో ఉంటారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ బాధ్యతలు నిర్వహించనున్నారు.

వరికి మద్దతు ధర


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాకరవాయిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మంచి మద్దతు ధర పొందాలన్నారు అలాగే క్వింటాకు రూ.500బోనస్ అందిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, సీఈవో సత్యనారాయణ, ఏఎంసీవైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఏఈవోలు బాలకృష్ణ, ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు సుమన్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి


ఐకేపీలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తిరుమలాయపాలెం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): వివిధ వర్గాల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు అందేలా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని పరిశీలించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. ఇందిరమ్మ మోడల్ ఇండ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ వన్ ర్యాంకర్‌కు సన్మానం

తిరుమలాయపాలెం, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరవాయికి చెందిన కొత్తపల్లి కుశీల్‌వంశీకి గ్రూప్‌వన్‌లో అర్హత సాధించగా శుక్రవారం తహసీల్దార్ సుధీర్, డీటీ నరసింహారావు ఆర్ఐ వీరయ్య,లక్ష్మణ్‌లు సన్మానించారు. ధ్రువీకరణ పత్రాలకోసం తహసీల్దార్ కార్యాలయానికి రాగా ఆయనను శాలువాతో సత్కరించారు.

రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది

రైతుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామంలో ఆంధ్రా బ్యాంక్ కర్షక సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నాగచంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ విజయలక్ష్మీ, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.

కుల వివక్షపై పోరాటం చేసిన జ్యోతి బా పూలే


నివాళులర్పిస్తున్న పువ్వాళ్ల, రాయల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుల వివక్షపై మహాత్మా జ్యోతి బా పూలే జీవిత కాలం పాటు అనేక పోరాటాలు చేసి విజయం సాధించారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పూలే జయంతి వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతర శ్రమతో ఉన్నత లక్ష్యాలు

'బొమ్మ' కల్చరల్ ఫెస్ట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్ ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నిరంతర శ్రమతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక బొమ్మ విద్యా సంస్థల్లో నిర్వహించిన 12వ జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు తమ లక్ష్యంపై స్పష్టత అవసరమని అన్నారు. చిన్నతనం నుంచి ఇతరుల గైడెన్స్‌తో మనం ఈ స్థాయికి వచ్చామని, ప్రస్తుతం మనకు ఏం కావాలి, మనం ఏం సాధించాలి అనే ప్రశ్న వేసుకుని ఆ దిశగా ప్ర యాణించాలని సూచించారు. గొప్ప స్థాయి చేరుకున్న తర్వాత మరో పది మందికి సహాయం చేయాలని, మన గ్రామాన్ని, ఊర్లను అభివృద్ధి చేసేందుకు మరింత తోడ్పాటు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఇస్రో మాజీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ గంజి వెంకటనారాయణను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొమ్మ విద్యా సంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్య ప్రసాద్, ఇస్రో మాజీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ గంజి వెంకట నారాయణ, సైకాలజిస్ట్ డాక్టర్ అశోక్ పరికిపండ్ల, బొమ్మ కళాశాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిక్షం, బొమ్మ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయ్ భాస్కర్, బొమ్మ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిరణ్ జ్యోతి, బొమ్మ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న బొమ్మ యాజమాన్యం

మిల్లర్లు ధాన్యం తరుగు పేచీ పెట్టొద్దు

అధికారులు, మిల్లర్లతో అదనపు కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంట కొనుగోలు సమయంలో మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం తరుగు తీయవద్దని, పేచీలు పెట్టొద్దని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంట కొనుగోళ్లు ఖమ్మం జిల్లాలో ప్రారంభమైందన్నారు. జిల్లాలో 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 212 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 25 కేంద్రాలు కొనుగోళ్ల ప్రారంభించాయని, 13 కేంద్రాలలో ధాన్యం వివరాలు ఓపీఎంఎస్ లో నమోదు చేశారని తెలిపారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో రైస్ మిల్లులకు ధాన్యం అలాట్మెంట్ చేశామని, కొనుగోలు ప్రక్రియకు మిల్లర్లు సహకారం అందించాలన్నారు. కొన్ని రైస్ మిల్లులలో బస్తాకు నాలుగు కిలోల తరుగు తీస్తున్నట్లు సమాచారం అందుతుందని అన్నారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు పంపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లో తరుగు తీయడానికి వీలులేదని అన్నారు. ధాన్యం తూర్పార పట్టిన తర్వాత మాత్రమే రైస్ మిల్లులకు తరలించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే సమయంలో నాణ్యత ప్రమాణాలను వ్యవసాయ విస్తరణ అధికారి సర్టిఫై చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని అన్నారు. రాబోయే 10 రోజుల్లో ధాన్యం భద్రపరిచే గోదాం ఖాళీ అవుతాయని, ఎలాంటి ఇబ్బందులు రావని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా సహకార అధికారి గంగాధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

పూలేను మర్చిపోయిన కేఎంసీ.. జయంతి వేడుకలకు దూరం



ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నాయకులను భవిష్యత్ తరాలు గుర్తించుకోవాలని, వారి స్ఫూర్తి సమాజంలో పెరగాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ, రాష్ట్రీయ నాయకులు జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తాయి. ఈ మేరకు ప్రభుత్వం ప్రొటోకాల్ వ్యవస్థను ప్రత్యేకంగా రూపొందించింది. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పర్యవేక్షకులు లేదా మెనేజరు కచ్చితంగా జయంతి కార్యక్రమాలు జరపాల్సి ఉంటుంది. గురువారం జిల్లా వ్యాప్తంగా అధికారికంగా మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కానీ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మాత్రం చిన్న ఫొటో పెట్టి దండ వేసిన వాళ్ల లేకపోయారు. మేయర్ పునుకొల్లు నీరజ సైతం కార్యాలయంలోనే అందుబాటులో ఉన్నారు. ఏఎంసీ నుంచి విభాగాల పర్యవేక్షకులు కార్యాలయంలో విధులకు హాజరైనారు. 350 మంది ఉద్యోగులు ఉన్న కేఎంసీ కార్యాలయంలో కుల వివక్షపై పోరాటం చేసిన జ్యోతి బా పూలే జయంతి వేడుకలు నిర్వహించకపోవటం పలు ఆరోపణలకు తెరలేపింది. ఈ విషయంపై కేఎంసీ ఇన్‌చార్జ్ మెనేజరు శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా స్పందించ లేదు.

బజాజ్ విద్యుత్ ఆటోలు ప్రారంభం


ఆటోను ప్రారంభిస్తున్న రాజేంద్రప్రసాద్ (రాజా)

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రహదారులపై ప్రముఖ కంపెనీ బజాజ్ విద్యుత్ ఆటోలు ఇక ప్రయాణించనున్నాయి. బజాజ్ ఆటో సంస్థ నూతనంగా మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టిన బజాజ్ గో గో విద్యుత్ ఆటోను వీవీసీ మోటార్స్ ఎండీ రాజేంద్రప్రసాద్ గురువారం ఖమ్మంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి చార్జి చేస్తే 250 కిమీ దూరం వరకు ప్రయాణం సాగిస్తుందన్నారు. బజాజ్ రీజనల్ మెనేజరు బాబ్జీ ఆటో నూతన ప్రమాణాలను, సాంకేతిక విషయాలను వివరించారు.

పడకేసిన పారిశుధ్యం

» విషజ్వరాలు, అంటు వ్యాధులతో బాధపడుతున్న కుటుంబాలు » పట్టించుకోని అధికారులు

వైరా, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వైరాలో ఆర్‌అండ్‌బీ, మునిసిపల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో స్థానిక ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఆవాసాల మధ్య మురుగునీరు చేరి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల బారీనపడి జ్వరాలు, అంటువ్యాధులతో తల్లడిల్లుతున్నారు. అయినప్పటికీ ఈ సమస్య పరిష్కార విషయంలో ఆర్‌అండ్‌బీ, మునిసిపాలిటీ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. వైరాలోని మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డును రూ.12కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. పదినెలల కిందట ఈ రోడ్డు నిర్మాణం ప్రారంభించినప్పటికీ ఇంతవరకు ఎక్కడ వేసి న గొంగళి అక్కడే అనే చందంలా ఉంది.

స్థానిక సైదులుదర్గా సమీపంలో రోడ్డు అడుగున ఉన్న ఓ పైపుకల్వర్టును రోడ్డు నిర్మాణ పనుల సమయంలో మట్టి పోసి మూసివేశారు. దాంతో రోడ్డుకు ఓవైపు నుంచి గతంలో ప్రవహించే మురుగునీటికి కల్వర్టు మూసివేతతో అడ్డుకట్ట పడింది. దాంతో ఆమురుగునీరు మొత్తం ఆవాసాల మధ్య చేరి సమస్యగా మారింది. రోడ్డు నిర్మాణం చేపట్టిన ఆర్‌అండ్‌బీ అధికారులు ముందుగా ఈ పైపుకల్వర్టు పనులను పూర్తిచేయాల్సి ఉంది. అయి తే అందుకు భిన్నంగా అనేక ఏళ్ల నుంచి మురుగునీరు ప్రవహిస్తున్న కల్వర్టును పూర్తిగా మూసివేశారు. రోడ్డుకు రెండువైపులా డ్రెయినేజీ నిర్మిస్తున్నామనే కారణం చూపుతూ ఈ కల్వర్టును మూసివేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పుడు డ్రెయినేజీలు నిర్మించటం లేద ని మాటమార్చారు. ఈ సమయంలో మట్టితో పూడ్చివేసిన పైపు కల్వర్టును పున రుద్ధరించకుండా నిర్లక్ష్యంగా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా నివాసాల మధ్య మురుగునీరు నిలిచి దోమలు, పందులు స్వైర విహారం చేస్తూ స్థానికులను అనారోగ్యం పాలుజేస్తున్నాయి. అదే సమయంలో రోడ్డుకు రెండువైపులా ఉన్న మునిసిపాలిటీకి చెందిన తాగునీటి పైపులైన్లు పగిలిపోయి నీరు లీకవుతుంది. వాటి మరమ్మతుల కోసం ఐదారు అడుగుల లోతులో రెండు, మూడునెలల కిందట గుంతలు తవ్వి మరమ్మతులు చేయ కుండా వదిలేశారు.

పట్టించుకోని రెండుశాఖల అధికారులు...

తమ ఇళ్ల పరిసరాల్లో నిలిచిన మురుగునీటిని తొలగించాలని అనేకసార్లు మొరపెట్టుకున్నా దాంతో తమకేమీ సంబంధం లేద ని అధికారులు, సిబ్బంది చెబుతున్నారని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఆర్‌అండ్‌బీశాఖ చేస్తున్నందున డ్రెయినేజీలు నిర్మించి మురుగునీటి సమస్యను వారే పరిష్కరించాలని మునిసిపాలిటీ వారు చెబు తున్నారని స్థానికులు తెలిపారు. ఇదే సమస్యపై ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బందిని అడిగితే డ్రెయినేజీలు, కల్వర్టు నిర్మాణానికి తమకు ఎలాంటి అనుమతులు రాలేదని అందువలన తామేమీ చేయలేమని చెపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ మురుగు కూపం నుంచి తమకు విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆవాసాల మధ్య ఖాళీస్థలంలో నిలిచిన మురుగునీరు

గ్రూప్-1 ర్యాంకర్‌కు మంత్రి పొంగులేటి సన్మానం



లక్ష్మీసాహితిని అభినందిస్తున్న మంత్రి పొంగులేటి

వైరా, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తొమ్మిదోవార్డుకు చెందిన గ్రూప్-1 ర్యాంకర్ సంగెపు లక్ష్మీసాహితిని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సన్మానించి అభినందించారు. శుక్రవారం వైరా సత్రంబజార్‌లోని అయిలూరి మోహన్‌రెడ్డి ఇంట్లో జరిగిన వివాహ వేడుకలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీసాహితిని పొంగులేటి శాలువాతో సన్మానించి అభినందించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకుడు గుమ్మడదల వెంకటనారాయణ, పాల్గొన్నారు.

సభ్యత్వాలు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి

కొణిజర్ల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖలో కొత్తజీవోను రద్దు చేసి పాత జీవో ప్రకారం ముదిరాజ్, గంగపుత్రులు లేని చోట అన్ని కులాలకు మత్స్యశాఖ సభ్యత్వాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని పెద్దమునగాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పరికపల్లి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశాడు. కోమట్లగూడెం మత్స్యశాఖ అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్వర్లు, శ్రావణ్, గడల నరేంద్రనాయుడు, కనగంటి వెంకటేశ్వర్లు, కిరణ్, కుమార్, రంజిత్, రావు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ

వైరా, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో సిల్వర్ జోన్ ఫౌండేషన్ న్యూఢిల్లీవారు నిర్వహించిన జాతీయ సైన్స్(ఎన్ఎస్‌వో) ఇంటర్నేషనల్ మ్యాథ్స్(ఐఎంవో) ఇంటర్నేషనల్ ఇంగ్లీష్(ఐఈవో) ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. 46 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిలో 18మంది గోల్డ్ మెడల్స్, 17మంది సిల్వర్ మెడల్స్, 9మంది విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, పాఠశాల ప్రిన్సిపల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు అభినందించారు.



సాయం అందిస్తున్న దృశ్యం

ఆర్థికసాయం అందజేత

ఎర్రుపాలెం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఖమ్మంజిల్లా ఫొటోగ్రాఫర్ సంఘం సభ్యుడు తాటికొండ గోపాలకృష్ణమాచారి కుటంబాన్ని శుక్రవారం పలువురు ఫొటో గ్రాఫర్లు పరామర్శించారు. మృతుడి కుటుంబానికి సంఘం జిల్లా అధ్యక్షుడు మారగిని వెంకట్ రూ.10వేలను అందించారు. ఈకార్యక్రమంలో పార్వతి, తిరుపతిరావు, మురళీధర్, హరినాద్, మహేష్, అశోక్, ముత్యాలరావు పాల్గొన్నారు.

బేతుపల్లిలో నేడు పెద్ద తిరునాళ్లు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతుపల్లిలో 200ఏళ్ల చరిత్ర కలిగిన అంకమ్మతల్లి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి గ్రామ ప్రభబండి ఊరేగింపు నిర్వహించారు. కాగా నేడు గండదీపాలు, రాత్రి నుంచి పెద్ద తిరునాళ్లు, తెల్లవారుజామున అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 13న బద్దెగొర్రె, చంద్రపట్నం, సాంస్కృతిక కార్యక్రమాలతో తిరునాళ్లు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఎం ధర్నా



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం శ్రేణులు

మధిర రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని శుక్రవారం మధిరలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైల్వేగేట్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు శీలం నర్సింహారావు, పడకంటి మురళీ, పాపినేని రాంనర్సయ్య, మందా సైదులు, టి.రాధాకృష్ణ, వూట్ల శంకర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

తల్లాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు 24గంటలకుపైగా అమ్మవార్ల ఊరేగింపు ఉత్సాహంగా కొనసాగింది. మంగళవాయిద్యాలతో ప్రత్యేక వాహనంపై అమ్మవార్లను ఊరేగించారు. ప్రతి ఇంటా అమ్మవార్లకు పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు, మారెళ్ల దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, దొడ్డా చిన్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

తల్లాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం తల్లాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాతీయ కిసాన్‌మోర్చా నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నాయకులు ఆపతి వెంకటరామారావు, చల్లా నాగులు, తేజావత్ బాలాజీనాయక్, గాదె కృష్ణారావు, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఏన్కూరు, జన్నారం, ఆరికాయలపాడు, తిమ్మరావుపేట, గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ వెంకటరామారావు, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో ఎస్.రమేష్, ఏవో నరసింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మేడ ధర్మారావు, లాలునాయక్, బానోతు రామారావు, చందమామనరసింహారావు, మాదినేని లెనిన్, శోభన్‌నాయక్, పటాన్‌మజీద్‌ఖాన్, ప్రభావతిరెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: రాయల

ముదిగొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. ముదిగొండ మండలం గోకినపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గోకినపల్లి గ్రామానికి చెందిన గుగులోతు కాంతి, బాబూనాయక్ ఇంట్లో సన్నబియ్యం భోజనాన్ని డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తో కలిసి ఆరగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ బాబు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రం, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, పసుపులేటి దేవేంద్రం, వెంకటయ్య, రమేష్, అజయ్, పుల్లారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాయల

బీఆర్ఎస్ సభను జయప్రదం చేయండి

» మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్



సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌లాల్

కారేపల్లి, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ అన్నారు. శక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉన్నం వీరేందర్, వాంకుడోత్ జగన్, ఉద్యకారుడు జడల వెంకటేశ్వర్లు, వసంత, డంకెన్ రవి, హన్మకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

» బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

వైరా, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటల ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిసాన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం కిసాన్‌మోర్చా బృందం వైరాలో పర్యటించింది. వైరా ఏఎంసీలోని మొక్కజొన్నలు ఇతర పంటలను పరిశీలించారు. ఏఎంసీ కార్యదర్శితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, కార్యదర్శి చిలుకూరి రమేష్, మనుబోలు వెంకటకృష్ణ, కోసూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి'



మాట్లాడుతున్న చలసాని సాంబశివరావు

సత్తుపల్లి, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు అన్నారు. మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా కళాశాలలో శుక్రవారం 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో కార్నివాల్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల బాధ్యులు కంచర్ల సత్యనారాయణ, కొత్తూ రు ప్రభాకరరావు, కందిమళ్ల కృష్ణారావు, కొత్తూ రు సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎల్వీఆర్.దీక్షితులు, అజయ్, డా.ఎంబీఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ జాకీర్‌హుస్సేన్, డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు పాల్గొన్నారు.

వివిధ అంశాలలో పోటీపడి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించేందుకు జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్వీ.రమణ, 15వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డి.రంగారెడ్డి, సబ్‌జైల్ సూపరింటెండెంట్ యూ.కుటుంబరాజు నేడు రానున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు.

అండర్ పాస్ నిర్మాణంలో ప్రభుత్వ వైఫల్యం

మధిరటౌన్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మధిరలోని రైల్వేగేటు వద్ద అండర్ పాస్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే నేడు ప్రజలు ఇబ్బందులకు గురి కావలసి వస్తుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రైల్వేగేటు వద్ద గోడ నిర్మిస్తున్న ప్రదేశాన్ని బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు సుమంత్, పాపిరెడ్డి, రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, గడ్డం శ్రీహరి, చిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్ పాల్గొన్నారు.

రైల్వేగేట్ గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలి : సీపీఎం, సీపీఐ

మధిర రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణ నడిబొడ్డులో ఉన్న రైల్వేగేట్ వద్ద గోడ నిర్మాణం చేసేందుకు పనులు ప్రారంభించారని, తక్షణమే నిలిపివేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మధిర రైల్వేగేట్ వద్ద గోడ నిర్మించే ప్రాంతాన్ని సీపీఎం, సీపీఐ నాయకుల బృందం పరిశీలించింది. నిర్మాణాన్ని నిలిపివేసి మినీ సబ్‌వే మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పోలీసులు సంఘటన వద్దకు చేరుకొని సీపీఎం, సీపీఐ నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు శీలం నర్సింహారావు, బెజవాడ రవిబాబు, పాపినేని రాంనర్సయ్య, మందా సైదులు, పడకంటి మురళీ, వూట్ల కొండలరావు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి: ఎమ్మెల్యే



కొణిజర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల/ ఏన్కూర్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్‌లు పడుతున్న కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయా మండలాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాలలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా మహిళ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పీసీసీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, సూరంపల్లి రామారావు, మాజీ ఎంపీపీ గోసు మధు, కార్యక్రమం మండల ఇన్‌చార్జీ పసుపులేటి దేవేందర్, కోసూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, శేఖర్‌గౌడ్, పుచ్చకాయల వీరబద్రం, ఏన్కూరు, మండల అధ్యక్షులు స్వర్ణనరేంద్రంకుమార్, మంగిలాల్‌నాయక్, చంద్రశేఖర్, వేముల కృష్ణప్రసాద్, ప్రభావతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న కేంద్రం

ముదిగొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ దుర్గా ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం ముదిగొండ మండలం వెంకటాపురంలో జరిగిన జై బాపూ...జై భీమ్... జై సంవిధాన్ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం, సామినేని వెంకటయ్య, సామినేని రమేష్, మల్లెల అజయ్, పుల్లారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

తల్లితో పాటు బిడ్డ ఆరోగ్యం ముఖ్యం

» సీడీపీవో ఎన్.కనకదుర్గ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.కనకదుర్గ అన్నారు. శుక్రవారం పోషణ పక్షంలో భాగంగా పట్టణంలోని అయ్యగారిపేట, వేంసూర్ రోడ్‌తో పాటు మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రజిని, మహాలక్ష్మి, సుజాత, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు విజయమ్మ, వెంకటమ్మ, సత్యవతి, ఫాతిమాబీ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లి గోపవరం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యానికి చిరుధాన్యాల వినియోగంపై గర్భిణులకు, బాలింతలకు శుక్రవారం అవగాహన కలిపించారు. ఆరోగ్యానికి చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల లాభాలు, పరిసరాల పరిశుభ్రత, మహిళల్లో రక్తహీనతవల్ల జరిగే నష్టాలను వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మందడపు రాజేశ్వరి, వెంకమ్మ, హెల్పర్లు వెంకటనర్సమ్మ, తదితరులున్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి: బిడ్డల ఆరోగ్య పరిరక్షణ కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ దేవేంద్ర అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తకమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సుధారాణి, బీబీ నాంచారి, నర్సింహారావు,కార్యదర్శి నర్సింహారావు, ఏఎన్ఎం విజయకుమారి, ఉపాధ్యాయుడు షబ్బీర్, ఉమ పాల్గొన్నారు.



కారేపల్లిలో చిరుధాన్యాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

పాలడుగులో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

వైరా, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు గ్రామంలో ఉన్న సమస్యలపై అక్కడి పంచాయతీ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ఈ ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. పాలడుగుకు సంవత్సరకాలం నుంచి మిషన్ భగీరథ మంచినీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వీధిలైట్లు వెలగటం లేదని, ఈజీఎస్ పనులు కల్పించడం లేదని, ఈజీఎస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అర్హులైన వారికి రేషన్‌కార్డులు, పింఛన్లు లేవని, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని విమర్శించారు.ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, షేక్.మజీద్, షైనాబీ, రెహనా తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న చిన్నారులు



మధిరరూరల్‌లో...



తల్లాడలో...

జ్యోతిబా పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

సత్తుపల్లిరూరల్/మధిర రూరల్/తల్లాడ/ కల్లూరు/వైరా, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే జయంతిని పలు పట్టణాల్లో, మండలాల్లో పలువురు నాయకులు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనజనుల సముద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



కల్లూరులో...



వైరాలో...